# పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్ • అధికారులతో సమీక్ష

కలెక్టరేట్, జూలై 24: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని, ఆ దిశగా జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం రాత్రి ఆయన పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, జీవో నంబర్ 58, 59పై సంబంధితాధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, మూత్రశాలలు వంటి వసతులు కల్పించాలని ఆదేశించారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలని, పోలింగ్ కేంద్రాలను మార్చాల్సి వస్తే ముందుగా తెలియజేయాలని సూచించారు. జీవో నంబర్ 58, 59కి సంబంధించిన విచారణ పూర్తి చేయాలని, పట్టాల పంపిణీ కోసం లే అవుట్ డిస్ట్రిబ్యూషన్ పనులు కూడా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

### ఆయిల్ పామ్ సాగు చేసేలా ప్రోత్సహించాలి

జిల్లాలో రైతులు వారం రోజుల్లోగా వెయ్యి ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ఉపాధిహామీ, ఆయిల్ పామ్ సాగు, హరితహారం పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఆయిల్ పామ్ సాగులో ఆలస్యం జరుగవద్దని, డ్రిప్‌తో సంబంధం లేకుండా ప్లాంటేషన్ జరిపించాలని, పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు సక్రమంగా జరిగేలా ప్రతిరోజు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలని ఉద్యానవన శాఖ అధికారికి సూచించారు. ఆయిల్ పామ్ సాగు లక్ష్యం మేరకు జరిగేలా లోహియ సంస్థతో మొక్కలు తెప్పించేలా చర్యలు తీసుకోవాలని, డీడీలను సేకరించాలన్నారు. హరితహారం లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని సూచించారు. బీసీలకు లక్ష రూపాయల సాయం పథకం సక్రమంగా అమలయ్యేలా చూడాలని, మైనార్టీల కోసం ప్రభుత్వం పథకాన్ని అమలు చేయనున్న క్రమంలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టొప్పో, ఆర్డీవో మహేశ్వర్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, డీఆర్డీవో శ్రీలత, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, కలెక్టరేట్ ఏవో జగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూలై 24: నగరంలో మంగళవారం స్మార్ట్ సిటీ పనులు చేపడుతున్నందున ఉజ్వల పార్కు, ఎన్టీఆర్ విగ్రహం, శ్రద్ధ ఇన్ ప్రాంతం, అలకాపురిలో కొంత భాగం, పెద్దపల్లి బైపాస్ రోడ్డు ప్రాంతాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఎస్ఐని కలిసిన బీఆర్ఎస్ యూత్ నాయకులు


ఎస్ఐకి పుష్పగుచ్ఛం ఇస్తున్న బీఆర్ఎస్ యూత్ నాయకులు

కొత్తపల్లి, జూలై 24 : కొత్తపల్లి ఎస్ఐ చంద్రశేఖర్‌ను మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్ఐకి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గంగాధర చందు, శనిగరపు సతీశ్, కవ్వంపెల్లి ప్రశాంత్ తదితరులున్నారు.

## యంగ్ డైనమిక్ లీడర్ కేటీఆర్

- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

గంభీరావుపేట, జూలై 24: ఐటీ రంగాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్న యంగ్ డైనమిక్ లీడర్ మంత్రి కేటీఆర్ నిండునూరేండ్లు ఆరోగ్యంగా ఉండాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు ఆకాంక్షించారు. గోరంటాలలో ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో కలిసి సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి.. స్వీట్లు పంపిణీ చేశారు. 38మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు చీరలను జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ అందించారు. ఆలయ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. సుమారు 400మందికి జడ్పీటీసీ విజయ అన్నదానం చేశారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నారు. వేడుకల్లో ఎంపీపీ వంగ కరుణ, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, సింగిల్‌విండో చైర్మన్ భూపతి సురేందర్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, వైస్ ఎంపీపీ దోసల లత, సర్పంచులు కొలుముల అంజమ్మ, కటకం శ్రీధర్, అల్లె సత్యం, ఎడబోయిన రాజు, ఎంపీటీసీ ఎర్రం అంజిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు మోతె రాజిరెడ్డి, కమటం రాజేందర్, నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్, వంగ సురేందర్‌రెడ్డి, లింగన్నగారి దయాకర్ రావు, లతారెడ్డి, కమ్మరి రాజారాం, నాగపురి బాలరాజుగౌడ్, అక్కపల్లి రాజనర్సింహారెడ్డి, భాషనవేని సురేందర్, గుర్రం దేవాగౌడ్, రామాంజగౌడ్, కొత్తింటి హన్మంతరెడ్డి, గంద్యాడపు రాజు, కొలుముల బాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, దుబాసి రాజు, బిల్లా రాజు, శేఖర్‌గౌడ్, దోమకొండ ఎల్లం, వెంకటియాదవ్, లింగంయాదవ్, సలీం, దేవేందర్, ఎగదండి స్వామి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి నగదు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, పాలకవర్గ సభ్యులు

## పేద విద్యార్థికి ఆర్థిక సాయం

చొప్పదండి, జూలై 24: మంత్రి కేటీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని చొప్పదండి పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి సోమవారం పట్టణానికి చెందిన నిరుపేద విద్యార్థి పొన్నం ప్రవళికకు రూ. 5 వేల నగదు సంఘం తరపున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మహేశ్ గౌడ్, డైరెక్టర్లు గుర్రం ఆనంద రెడ్డి, కళ్లెం లక్ష్మీరెడ్డి, నాంపల్లి మల్లయ్య, బండారి కొమురయ్య, కార్యదర్శి కళ్లెం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ చౌక్‌లో నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

## వామపక్షాల నిరసన

తెలంగాణచౌక్, జూలై 24: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలను నిరసిస్తూ సీపీఎం జిల్లా అధ్యక్షుడు మిల్కూరి వాసుదేవారెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పలు వామపక్షాల విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. మానవహారం నిర్వహించారు. అనంతరం ప్రతిమ మల్టీప్లెక్స్ వరకు ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు లక్ష్మి, శ్రీనివాస్, పైడి రాజు, మల్లవ్వ, ఐద్యా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి, వామపక్షాల విదార్థి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


నీటి సంపు పరిశీలిస్తున్న అంగన్‌వాడీ టీచర్

కలెక్టరేట్, జూలై 24: ప్రతి ఒక్కరూ ఇంటితో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మహిళలకు అవగాహన కల్పించారు. నగరంలోని కోతిరాంపూర్ క్లస్టర్ స్థాయిలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు డ్రై డే నిర్వహించారు. పోచమ్మవాడ, బైపాస్ రోడ్, హనుమాన్ గుడి వీధి, మణిదీప పాఠశాల ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి వర్షపు నీరు నిలిచి ఉండకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి ఐలేందర్ యాదవ్, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, శ్యామల, సరిత, ఏఎన్ఎం స్రవంతి, ఆర్పీలు రమ, రాధ, లక్ష్మి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇంటర్వ్యూలు

కమాన్‌చౌరస్తా, జూలై 24: నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల (అటానమస్)లో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా, తెలుగులో-3, ఇంగ్లిష్‌లో-3, కామర్స్-2, కంప్యూటర్ సైన్స్‌లో-3, బీబీఏ-2, బిజినెస్ ఎనలిటిక్స్-1, డాటా సైన్స్-1, బీసీఏ-2, ఫిషరీస్-1, స్టాటిస్టిక్స్-1 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు ఉండి, నెట్, సెట్, పీహెచ్‌డీ, టీచింగ్‌లో అనుభవం ఉన్న వారికి వెయిటేజీ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక జత జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు.

## 40 మంది డీఎస్పీలకు స్థాన చలనం

రాంనగర్, జూలై 24: రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగోన్నతి పొందిన డీఎస్పీలకు పోస్టింగ్‌లు కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీల్లో కొత్తగా ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందిన వారితో పాటు ప్రస్తుతం పని చేస్తున్న కొంతమందికి స్థాన చలనం కల్పించారు. 40 మందికి పోస్టింగులు కల్పించగా వీరిలో కరీంనగర్‌లో పని చేస్తున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విజయసారథి, సీసీఎస్ ఏసీపీ శ్రీనివాసులు డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలన్నారు. వారి స్థానంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా కే గిరికుమార్, సీసీఎస్ ఏసీపీగా వీ మాధవి రానున్నారు.

## నేడు పలు డివిజన్లలో నీటి సరఫరాలో అంతరాయం

కార్పొరేషన్, జూలై 24: హైలెవల్ జోన్ పరిధిలో గల కోర్టు ట్యాంకు నుంచి అంబేద్కర్ నగర్ రిజర్వాయర్‌కు వచ్చే పైప్ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నందున మంగళవారం నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్‌నగర్ రిజర్వాయర్ పరిధిలోని పలు 2, 3, 4, 5, 24, 25, 26, 27, 28, 42, 44 డివిజన్లలో నీటి సరాఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

## రామడుగు ఎస్ఐ బాధ్యతల స్వీకరణ


సీఐ రవీందర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ తిరుపతి

రామడుగు, జూలై 24: రామడుగు ఎస్ఐగా తోట తిరుపతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్ఐకి ఏఎస్ఐలు గౌస్‌ఖాన్, అనంతరెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన చొప్పదండి సర్కిల్ కార్యాలయంలో సీఐ గోపతి రవీందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

## నగదు అందజేత

చొప్పదండి, జూలై 24: మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన నిరుపేద బూస రాములు ఇటీవల మృతిచెందారు. కాగా, గ్రామానికి చెందిన పేరం కిషన్ రూ. 5000 నగదును సర్పంచ్ మామిడి లత-రాజేశం చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరం సురేందర్, ఆవుల రాజయ్య, గసికంటి కుమార్, దీకొండ రమేశ్, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వృద్ధాశ్రమం తనిఖీ

కలెక్టరేట్, జూలై 24: నగరంలోని ప్రభుత్వ వృద్ధుల, దివ్యాంగుల వసతి గృహాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో వృద్ధులు, దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహ వార్డెన్ సెలవులో ఉండగా, ఇతరులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించకపోవడం, ఏఎన్ఎం కూడా అందుబాటులో లేకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే, స్వధార్ హోంను కూడా పరిశీలించారు. అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది తణుకు మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

## సబ్బండవర్గాల సంక్షేమమే సర్కారు ధ్యేయం

- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, జూలై 24: సబ్బండవర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో కవర్‌షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి, మాట్లాడారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నదని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగు, తాగు నీటి గోసలు తీరాయన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు. పంటలు వర్షాలకు తడవకుండా ఉండేందుకు గానూ మార్కెట్‌యార్డులో కవర్‌షెడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా మార్కెట్‌యార్డులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, సర్పంచులఫోరం మండలాధ్యక్షుడు చల్ల నారాయణ, సర్పంచ్ కూనబోయిన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎంద్ర చందన్, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య, ఉప సర్పంచులు సాదుల్, బాలకిషన్, మీసరగండ్ల అనిల్, రఘు, బాలరాజు తదితరులు ఉన్నారు.